ఘనంగా రంజాన్ వేడుకలు

- ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, నాయకులు


భైంసాలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భైంసాటౌన్: రంజాన్ సందర్భంగా స్థానిక గడ్డెన్న వాగు ప్రాజెక్టు సమీపంలోని ఈద్గా వద్దకు గురువారం ఉదయం నుంచే ముస్లింలు తరలివచ్చి మతపెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పట్టణంలోని పంజేషాచౌక్‌తో పాటు మజీదుల్లో ప్రార్థనలు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రామారావుపటేల్, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావుపటేల్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ పట్టణంలోని పార్టీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సోన్: మండలకేంద్రంతోపాటు న్యూవెల్మల్ బొప్పారం తదితర గ్రామాల్లో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు ఈద్గాల వద్ద ప్ర త్యేక ప్రార్థనలు చేశారు. అబ్దుల్ అజీజ్, అన్సర్ పాషా, హర్షద్, ఫేరోజ్, బావుద్దీన్, సమాద్, రఫీయొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండలకేంద్రంతోపాటు మండలంలోని ఎలగడప, లింగాపూర్, పాతమద్దిపడగ, బెల్లాల్, కొండుకూర్ గ్రామాల్లో రంజాన్ వేడుకలు జరుపుకొన్నారు. ఈద్గాల వద్ద ముస్లింలకు కాంగ్రెస్ నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, మండలాధ్యక్షుడు మల్లేశ్, వెంకటేశ్, రఫీక్, బ్రహ్మచారి, సత్యంచారి, రహీం, బబ్లూ, బాబాసేట్, భూషణ్, తదితరులున్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని దర్గా వద్ద ముస్లింలు మతపెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి ఆత్రం సుగుణ ముధోల్ వచ్చి ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.

లోకేశ్వరం: మండలంలోని రాజూరా, లోకేశ్వరం, నగర్, పిప్రి, ధర్మోర, రాయపూర్‌కాండ్లీ, పంచగుడి, మన్మద్, బామ్ని(కే), గడ్‌చాంద తదితర గ్రామాల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఎస్సై సాయికుమార్ ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు.

తానూరు: మండలంలోని తానూరు, కోలూరు, ఎల్వి, భోసి, దాగాం గ్రామాల్లో ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

లక్ష్మణచాంద: మండలంలోని లక్ష్మణచాంద, మల్లాపూర్, కాశీగూడ, మునిపెల్లి, పార్‌పెల్లి,ధర్మారం, వడ్యాల్, కంజర్ గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.

కుంటాల: మండలంలోని ఓలా, కల్లూర్, అంబకంటి, కుంటాల, లింబా(కె), దౌనెల్లి గ్రామాల్లో రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఎస్సై వి.రజనీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్, వానల్‌పాడ్, మిర్జాపూర్, ఇలేగాం, దేగాంతోపాటు ఆయా గ్రామాల్లో రంజాన్ వేడుకలు నిర్వహించారు.

సారంగపూర్: మండలంలోని సారంగపూర్, జామ్, బీరవెల్లి, చించోలి(బి), స్వర్ణ గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు వస్తువులు, డబ్బులు, ఆహారం దానం చేశారు. మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు పఠాని రాధ, ఆయా పార్టీల నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఖానాపూర్: పట్టణంలోని ఈద్గాలో స్థలభావం కారణంగా పలువురు ముస్లింలు పక్కనున్న నిర్మల్-ఖానాపూర్ రహదారిపై ప్రార్థనలు చేశారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురి నివాసాల్లో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.

కుభీర్: మండలకేంద్రంతోపాటు పార్డి(బి), జామ్‌గాం, పల్సి, నిగ్వా, చొండి గ్రామాల్లో గురువారం ముస్లింలు రంజాన్ పండుగ నిర్వహించారు.

నర్సాపూర్(జి): మండలంలోని నర్సాపూర్(జి), రాంపూర్, చాక్‌పల్లి, టెంబరేణితోపాటు గ్రామాల్లో రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెంబి: మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నీల్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఖానాపూర్: పట్టణంలోని అంగడిబజార్‌లో జామా మజీద్ అధ్యక్షుడు మహ్మద్ జహీర్ అహ్మద్‌తోపాటు కరీంకాలనీలోని న్యాయవాదులు మహ్మద్‌ఖాజా, ఆసీఫ్ అలీ నివాసాల్లో జరిగిన రంజాన్ విందులో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోశ్, నిమ్మల రమేశ్, సతీశ్‌రెడ్డి, ముషీర్, ఇద్రిస్, మునిరుద్దీన్, అన్సార్ హైమద్, ఉమేర్ తదితరులు ఉన్నారు.


ముధోల్‌లో పండుగ శుభాకాంక్షలు చెబుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ


తానూరు: కోలూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


కడెంలో పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు


ఖానాపూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు సేమియా తినిపిస్తున్న జహీర్ అహ్మద్


భైంసారూరల్: తిమ్మాపూర్‌లో..


నర్సాపూర్(జి)లో శుభాకాంక్షలు చెబుతున్న నేతలు


సారంగపూర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


లక్ష్మణచాంద: మునిపెల్లిలో..


లోకేశ్వరం: రాజూరాలో ముస్లింల ప్రార్థనలు


కుంటాల మండలం ఓలాలో..


సోన్: న్యూవెల్మల్‌లో ఈద్గా వద్ద..


పెంబిలో శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు


కుభీర్‌లో ఆలింగనం చేసుకుంటున్న ముస్లింలు

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కడెం: మండలంలోని బెల్లాల్ గోదావరి రేవు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం బెల్లాల్ గ్రామశివారులో పట్టుకున్నట్లు ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

క్రికెట్ పోటీలు


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో గురువారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సర్కిల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. నిర్వాహకులు సాయికుమార్, బొండ భోజన్న మాట్లాడుతూ విజేతలకు ఈనెల 14న ప్రముఖుల చేత బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యవజన సంఘం అధ్యక్షులు కొండ రవి, కోశాధికారి వినోద్, ప్ర ణయ్, అంకం శ్రీనివాస్, వెంకాయి శ్రీనివాస్, శబరి, జ్ఞానేశ్వర్, గడ్డం స్వామి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నాయకుడికి సన్మానం


గులాబ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కుభీర్: మండలంలోని రంజని గ్రామానికి చెందిన రాథోడ్ గులాబ్ బీజేపీ గిరిజన మోర్చా నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను గురువారం మండలకేంద్రంలో బీజేపీ నాయకులు, పలువురు వ్యాపారులు సన్మానించారు. కార్యక్రమంలో కనకయ్య, ప్యాట లక్ష్మణ్, రెడిశెట్టి బాలాజీ, రెడిశెట్టి నిఖిల్, పండరి తదితరులు ఉన్నారు.

సన్మానం

కడెం: మండలంలోని చిట్యాల్ గ్రామంలో విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడు నల్లా రాంరెడ్డిని గురువారం పీఆర్టీయూ మండలశాఖ తరఫున శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు బొమ్మిడి మహేశ్వర్, సెక్రెటరీ గంగారాం, జిల్లా ఉపాధ్యక్షుడు కూచనపల్లి శ్రీనివాస్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రామమందిర్ వీధిలో రామాలయంలో నిర్వహించే సీ తారాముల కల్యాణ మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గురువారం ఆవిష్కరించారు. ఈనెల 17న నిర్వహించే కల్యాణ వేడుకలకు పట్టణ ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోనె రాజు, ఆకాశ్‌సింగ్, సాయికృష్ణ, రామకృష్ణ, సంతోష్, సుధీర్, శ్రీనివాస్, దత్తు, సాయి, శేఖర్ అర్చకులు పాల్గొన్నారు.

సాధనశూరుల విన్యాసాలు


ప్రదర్శన చేస్తున్న సాధనశూరులు

కుంటాల: మండల కేంద్రంలో గురువారం కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూర్‌కు చెందిన సాధన శూరుల విన్యాసాలు అలరించాయి. ఈసందర్భంగా మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. ముక్కు నుంచి నీళ్లు పట్టించి నోటి నుంచి పైపు ద్వారా బయటకు పంపడం, అగ్నిస్తంభన, బాణసాధన, ఇటుక, సుద్దపొడిని నీళ్లలో కలిపి తిరిగి యథావిధిగా తయారు చేయడం వంటి విన్యాసాలు ప్రదర్శించారు. సాధన శూరుల టీం సభ్యులు చింతకింది మహేందర్, కిరణ్, జగదీశ్వర్, రాజు, రమేశ్, సాయికృష్ణ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గుంత పూడ్చరూ..


ప్రమాదకరంగా గుంత

మామడ: మండలంలోని దిమ్మదుర్తి నుంచి నల్దుర్తి గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్టు వద్ద వర్షాలకు మట్టి కోతకు గురై గుంత ఏర్పడింది. రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయపడుతున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు గుంతను పూడ్చివేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జ్యోతిబాపూలేకు ఘన నివాళి


జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో..


భైంసాలో నివాళులర్పిస్తున్న బౌద్ధ ఉపాసకులు


లక్ష్మణచాంద: రాచాపూర్ ఎంజేపీలో..

నిర్మల్‌చైన్‌గేట్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన సామాజిక దార్శనికుడు జ్యోతిబాపూలే అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసేమ్మె రాజు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జ్యోతిబాపూలే జయంతి నిర్వహించారు. బీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుల కార్తీక్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అయ్యన్నగారి రాజేందర్, నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ శ్రావణ్, రాకేశ్, దిలీప్ పాల్గొన్నారు.

దేశ ప్రజల ఆరాధ్యదైవం జ్యోతిబాపూలే అని టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ బీసీ నేత ఎంబడి రాజేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలో జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళులర్పించారు. స్వర్ణ ప్రాజెక్టు మాజీ చైర్మన్ నారాయణ్‌రెడ్డి, సేవాదళ్ నాయకులు కందుల రాజేశ్వర్, బస శ్రీధర్, నర్సయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో పూలే విగ్రహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. రమేశ్, శివప్రసాద్, పోతన్నయాదవ్, సునీల్, జీవన్, సాయన్న తదితరులున్నారు.

భైంసాటౌన్: పూలే జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పలువురు పేర్కొన్నారు. బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పట్టణంలోని రాహుల్ నగర్ మైత్రేయ బుద్ధవిహార్‌లో గురువారం జ్యోతిబాపూలే జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటానికి నివాళులర్పించారు. బీఎస్‌ఐ అధ్యక్షులు ప్రసంజీత్ హేమ్లే, ఏక్‌నాథ్ బిరదే, రాహుల్, పరుశురాం వాగ్మారే పాల్గొన్నారు.

కడెం: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో పూలే జయంతి నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్, అంబేడ్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ల రమేశ్, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి లింగన్న, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భుక్యా రమేశ్, రాజలింగం, చిన్నయ్య ఉన్నారు.

తానూరు: మండల కేంద్రంతోపాటు ఉమ్రి(కే), బెంబర, వడ్గాం తదితర గ్రామాల్లో గురువారం భారతీయ బౌద్ధమహాసభ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతి నిర్వహించారు. సురేకాంత్ పవార్, భీమ్ పవార్, భగవాన్, సాయినాథ్, ఆనంద్‌రావ్, గంగాధర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం జ్యోతిబాపూలే జయంతి నిర్వహించారు. బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు కొంతం మురళీధర్, యువజన సంఘం మండల ఉపాధ్యక్షుడు నరేశ్, దయానంద్‌రావు, నాయకులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ ఎంజేపీ పాఠశాలలో, లక్ష్మణచాందలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. ఎంజేపీ ప్రిన్సిపాల్ సంతోష్, శ్రీనివాస్, నారాయణ, నాగరాజు, లావణ్య పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో గురువారం ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతి నిర్వహించారు. ఎస్ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నామత్కర్ నవీన్, ఉపాధ్యక్షుడు సంతోష్, సత్యం, సాయి తదితరులు పాల్గొన్నారు.


ముధోల్‌లో పూలమాల వేస్తున్న నాయకులు


తానూరులో బౌద్ధమహాసభ నాయకుల నివాళి


కడెంలో పాల్గొన్న నాయకులు

వరికి తెగులు..రైతుకు గుబులు


కన్కపూర్‌లో మెడవిరుపు సోకడంతో తాలుగా మారిన వరికంకులు

- పొట్టదశకు చేరిన పంట
- మొగిపురుగు, మెడ విరుపుతో తీవ్ర నష్టం
- పట్టించుకోని అధికారులు

లోకేశ్వరం: ప్రస్తుతం వరి పంట గింజ దశలో ఉంది. మరో పదిహేను రోజులైతే చేతికొచ్చే దశలో ఉన్న పంట తెగుళ్ల బారిన పడింది. సస్యరక్షణ చర్యలు చేట్టినా ఫలితం కనిపించడం లేదు. రోజు రోజుకూ తెగుళ్ల ఉధృతి పెరగడంతో దిగుబడిపై ప్రభావం చూపుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దీంతో పెట్టుబడులు కూడా దక్కవేమోనని రైతులు వాపోతున్నారు.

పొట్టదశలో మెడ విరుపు ..

వానాకాలంలో అధిక వర్షాలు కురువడంతో జిల్లాలో సుమారు 92 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. నాట్లు వేసినప్పటి నుంచే పంటకు తెగుళ్ల బెడద తప్పడం లేదు. మొదట్లో అగ్గితెగులు వ్యాపించింది..మొగి పురుగు తీవ్రతతో పైరు ఆశించినంత పెరగలేదు. సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకుంటే ఇప్పుడు పొట్టదశలో మళ్లీ మొగిపురుగు, మెడవిరుపుతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. మొగి పురుగుతో వరికంకులు తెల్లగా మారుతున్నాయి. మెడవిరుపుతో గింజ తాలుపోతోంది. వీటి నివారణకు కోసం రూ.వేలు వెచ్చించి క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నా.. ప్రయోజనం ఉండటం లేదని రైతులు వాపోతున్నారు.

పెట్టుబడులు వస్తే చాలు



యాసంగిలో పదెకరాల్లో వరి పంట సాగు చేశా. ప్రస్తుతం పంట గింజ దశలో ఉంది. ఆరు ఎకరాల్లో వరి పంటకు మెడవిరుపు తెగుళ్ల సోకడంతో కంకులు తెల్లగా మారుతున్నాయి. మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. రోజురోజుకూ ఉధృతి ఎక్కువ అవుతోంది. ఈసారి పెట్టుబడులు వస్తే చాలన్నట్లు పరిస్థితి ఉంది.

– మహేందర్‌రెడ్డి, అబ్దుల్లాపూర్

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పొట్టదశలో ఉండి పచ్చగా ఉంటేనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. స్థానిక వ్యవసాయాధికారుల సూచనల మేరకు కోరాజిన్ మందు పిచికారీ చేయాలి. పంట ఎండే దశలో ఉంటే ఎలాంటి మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండదు.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

అధికారులు అవగాహన కల్పించాలి..

అధికారులు గ్రామాల్లో పర్యటించి పంటలు పరిశీలిస్తూ పిచికారీ చేసే పురుగు మందులపై అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే చాలా వరకు నష్టపోయామని.. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు వేడుకుంటున్నారు.

పంటకు పరిహారం అందేలా కృషి


కాలిన పంట చేనును పరిశీలిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, నాయకులు

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామంలో మొక్కజొన్న పంట నష్టపోయిన మేడిపల్లి దేవేందర్‌కు నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ అన్నారు. బుధవారం దేవేందర్ చేనులో అగ్నిప్రమాదం జరగడంతో రెండెకరాల్లో మొక్కజొన్న పంట కాలిబూడిదైన విషయం తెలిసిందే. గురువారం ఎమ్మెల్యే కుంసర గ్రామానికి వెళ్లి కాలిన చేనును పరిశీలించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందేలా చూస్తానని బాధితులకు భరోసా కల్పించారు. వారి వెంట సోలంకి భీంరావుపటేల్, ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని దేగాం సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే రామారావుపటేల్ పూజలు చేశారు. అఖండ హరినామ సప్తాహంలో పాల్గొని మాట్లాడారు. భైంసా మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బాబా ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్న హారతిలో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

జామా మసీద్ అధ్యక్షుడిగా జహీర్ అహ్మద్



ఖానాపూర్: పట్టణంలోని పురాతమైన జామా మసీద్ అధ్యక్షుడిగా మహ్మద్ జహీర్ అహ్మద్ నియమితులయ్యారు. జామా మసీద్‌తోపాటు ఈద్గా, కబ్రస్థాన్, ఆషూర్‌ఖానా, వక్ఫ్‌బోర్డు వ్యాపార సముదాయాలకు 11 మంది సభ్యులతో కూడిన కార్యవర్గాన్ని నియమిస్తూ తెలంగాణ వక్ఫ్‌బోర్డు నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ కమిటీలో అధ్యక్షుడితోపాటు ఉపాధ్యక్షులుగా మహమ్మద్ ముషీర్, కార్యదర్శిగా మహ్మద్ ఆసిఫ్‌అలీ, కోశాధికారిగా మహ్మద్ మునీరుద్దీన్, సభ్యులుగా షేక్ అన్సర్ అహ్మద్, మహ్మద్ నస్రుల్లాఖాన్, సయ్యద్ సాబీర్ హుస్సేన్, మహ్మద్ ఎతెషామొద్దీన్, సాజిద్ అహ్మద్‌ఖాన్, మహమ్మద్ ఇద్రిస్, సయ్యద్ జియా ఉద్దీన్ నియమితులయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అభినందించారు.